


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 5-7-2025

సంపుటి: 21 సంచిక: 88
పేజీలు: 8 వెల: రూ.1

# సిఫార్సులు పట్టలేదు.. రూల్సూ పాటించలేదు!

- రచ్చరచ్చ అయిన ఏఎన్ఎంల బదిలీ కౌన్సెలింగ్
- మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్.. అందరూ అసంతృప్తి
- చాలా సచివాలయాల పరిధిలో ఇద్దరికి పోస్టింగ్
- అదే సమయంలో ట్రైబల్ ఏరియాల్లో భర్తీ కాని పోస్టులు
- రీ కౌన్సెలింగ్‌కు డిమాండ్ చేస్తున్న బాధితులు



సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలను ఓపిగ్గా , పారదర్శకంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు.. అంటూ డీఎంహెచ్‌వో అనితను సచివాలయ ఏఎన్ఎం ఉద్యోగుల సంఘం పేరుతో ఓ పుంజెడు మంది సన్మానిస్తున్న ఫొటో ఇది. వీరంతా రూరల్ నుంచి అర్బన్‌కు వచ్చిన బ్యాచ్.



కౌన్సెలింగ్‌లో అర్బన్ టు అర్బన్ పోస్టింగ్ ఇవ్వకుండా రూరల్‌లో ఉన్నవారిని తీసుకొచ్చి నగరంలో పోస్టింగ్ ఇచ్చారని, దీనివల్ల జీవోఎంఎస్ నెం.6ను తుంగలో తొక్కినట్లయిందని జిల్లా ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు, ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం స్వయంగా బాధిత ఏఎన్ఎంలను తీసుకెళ్లి కలెక్టర్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఫొటో ఇది.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొందరేమో ఓపిగ్గా 605 మందిని బదిలీ చేసినందుకు శాలువ కప్పితే.. మరికొందరేమో తమకు అన్యాయం జరిగిందని, రీ కౌన్సిలింగ్ చేయాలంటూ కలెక్టర్‌ను కలవడాన్ని ఎలా చూడాలి? ఈ పరిణామాలను పాఠకులు, పత్రికలు ఏ కోణంలో విశ్లేషిస్తున్నాయన్న విషయాన్ని పక్కన పెడితే నాయకులు, జిల్లా ఉన్నతాధికారులు అసలు ఈ వివాదాన్ని ఏ కోణంలో చూస్తున్నారనేది ప్రధానం.

### మంత్రి, ఎమ్మెల్యేల అసంతృప్తి

రెండు రోజుల పాటు జరిగిన ఈ కౌన్సెలింగ్‌కు సంబంధించి జిల్లాలో దాదాపు అందరు ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు ఇచ్చారు. ఆ మేరకు కొన్ని స్థానాలు బ్లాకులో పెట్టాలని దాని ఉద్దేశం. కానీ డీఎంహెచ్‌వో కార్యాలయ కౌన్సెలింగ్ బోర్డు మాత్రం రాజకీయ నాయకుల పేరు చెప్పి ఇష్టారీతిన బదిలీలు చేసుకుపోయారు. తీరా కౌన్సెలింగ్ పూర్తయ్యాక ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫార్సుల మేరకు బదిలీలు జరిగాయా? అని చూస్తే.. ఒక్కటి కూడా కనిపించలేదు. అలాగని బదిలీల ప్రక్రియపై ఫిర్యాదులు లేకుండా ఉన్నాయా? అంటే అదీ లేదు. దీంతో ఎమ్మెల్యేలకు చిర్రెత్తిపోయింది. పెంట పెంటగా జరిగిన కౌన్సెలింగ్ తీరిపై శ్రీకాకుళం ఎమ్మెల్యే నేరుగా డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి చెడామడా ఇచ్చేశారట. రీకౌన్సెలింగ్ చేయమని జిల్లా కలెక్టర్‌ను ఉద్యోగులు కోరారంటే ఏమేరకు అవకతవకలు జరిగాయో అర్థమవుతుందని, ఎంతమంది ఎమ్మెల్యేల సిఫార్సులు చెల్లాయో తెలుసని, జిల్లా కేంద్ర ఎమ్మెల్యేగా ఉన్న తన సిఫార్సులకే దిక్కు లేనప్పుడు మిగిలిన ఎమ్మెల్యేల మాట చెల్లుబాటైందంటే తాను నమ్మనని గొండు శంకర్ అన్నారట. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేది తామని, ఇలా పెంట చేస్తే నష్టపోయేది కూడా తామేనని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. అంటే కౌన్సెలింగ్ ప్రక్రియ సరిగ్గా జరగలేదని స్వయంగా స్థానిక ఎమ్మెల్యేనే ఒక అంచనాకు వచ్చినట్టు అర్థమవుతుంది. ఇక రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన స్వగ్రామమైన నిమ్మాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గత ప్రభుత్వం జనావాసాలకు దూరంగా నిర్మించేసిందని, అక్కడకు పేషెంట్లు వెళ్లలేకపోతున్నందున దాన్ని నిమ్మాడ గ్రామంలోకి షిఫ్ట్ చేయడానికి సంబంధిత ఫైల్ పట్టుకొని తన క్యాంపు కార్యాలయానికి డీఎంహెచ్‌వో

- మిగతా చివరి పేజీలో



ఈ ఫొటోలో ఓ పిల్లాడ్ని ఎత్తుకొని ఉన్న ఆమె సరుబుజ్జిలి మండలంలో ఓ సచివాలయంలో గ్రేడ్-3 ఏఎన్ఎంగా పని చేస్తున్నారు. తన కుమారుడికి మానసిక వైకల్యం ఉన్నందున తనకు అదే మండలంలో బదిలీ చేయాలని మొన్నటి కౌన్సిలింగ్‌లో కోరారు. కానీ ఈమెను శ్రీకాకుళం నగరంలో చంపాగల్లివీధికి బదిలీ చేశారు. దీంతో తన కుమారుడు, భర్తతో వచ్చిన ఆమె బాలుడ్ని డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో పెట్టేసి తనకు న్యాయం చేయాలంటూ వెళ్లిపోయారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు సదరం సర్టిఫికెట్ ఇవ్వరాదన్న నిబంధన ఉండటంతో ఏఎన్ఎం కుమారుడి వైకల్యాన్ని గుర్తిస్తూ ఎటువంటి ధ్రువపత్రం లేదు. దీంతో స్వయంగా కుమారుడ్నే తీసుకువచ్చి డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో వదిలేశారు. ఈ ఫొటోలో ఈమె పక్కనే ఉన్న మరో ఏఎన్ఎం చంపాగల్లివీధికి బదిలీ అయ్యారు. ఇద్దరూ మ్యూచువల్ అండర్‌స్టాండింగ్‌తో స్థానాలు మార్చుకోడానికి వచ్చామంటూ డీఎంహెచ్‌వోకు చెప్పినా, ఇప్పుడు తన చేతిలో ఏమీ లేదని, కలెక్టర్ చెబితే బదిలీ మారుస్తానంటూ డీఎంహెచ్‌వో చేతులెత్తేశారు. అయితే కలెక్టర్ స్పందించడంతో వీరిద్దరికీ మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ ఇవ్వడానికి డీఎంహెచ్‌వో అంగీకరించారు.

---

# భవిష్యత్తు 'బెంగ'..ళూరు!

ప్రపంచంలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) బూమ్ వస్తే.. అది మన దేశంలో బెంగళూరుకు వరంగా మారింది. ప్రశాంతమైన, ఆహ్లాదకర, ఆరోగ్యవంతమైన వాతావరణం కలిగిన ఈ మహానగరం ఐటీ ఇండస్ట్రీని విపరీతంగా ఆకర్షించింది. ఫలితంగా సిలికాన్ సిటీగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందింది. దాంతో ఒక్క కర్ణాటకలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతకు బెంగళూరు స్వర్గంలా.. కలల నగరంలా మారింది. ఐటీతోపాటు అనేక రంగాలు అభివృద్ధి చెందాయి. అభివృద్ధి కొత్తపుంతలు తొక్కింది. నగరం మహానగరంగా మారి జనసంఖ్య విపరీతంగా పెరిగింది. లక్షలాది ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా.. అద్దెకు ఇళ్లు దొరకని పరిస్థితి కనిపించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. నిన్నటి వరకు స్వర్గంలా కనిపించిన ఆ మహానగరం.. నేడు చాలామందికి మరుభూమిలా కనిపిస్తోంది. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, నానాటికీ తీవ్రమవుతున్న తాగునీటి సమస్య, వికేంద్రీకరణ కారణంగా ఐటీ పరిశ్రమలు కొత్తగా ఏర్పడకపోవడం వంటి కారణాలు.. ఇంతకాలం యువజనుల డెస్టినేషన్‌గా ఉన్న బెంగళూరును పక్కకు తప్పించేస్తున్నాయి. ఇదే దుస్థితిని వివరిస్తూ నగరాన్ని విడిచి వెళ్లిన ఒక యువజంట పోస్టు చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దానిపై నెటిజన్ల నుంచి భిన్న స్పందనలు వస్తున్నాయి. ఇంతకూ ఆ జంట తమ వీడియోలో ఏం చెప్పింది.. బెంగళూరు వాస్తవ పరిస్థితి ఏమిటి? ఒకసారి చూద్దాం.






- ఈ నగరం మమ్మల్ని చంపేస్తోంది!
- బెంగళూరును వీడుతూ ఓ యువజంట ఆవేదన
- వాయు కాలుష్యంతో ఆరోగ్యాలు దెబ్బ తిన్నాయని ఆరోపణ
- పెరుగుతున్న జనాబా.. విచ్చలవిడిగా గృహనిర్మాణాలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు.. నీటి పథకాలు
- వేసవిలో తాగునీటి కొరతతో అల్లాడిన జనం
- సామాన్యులకు అందుబాటులో లేని ఇళ్ల అద్దెలు

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

బెంగళూరు మమ్మల్ని చావుకు చేరువ చేస్తోంది.. అందుకే ఒక కఠిన నిర్ణయం తీసుకున్నాం.. అని నగరాన్ని వీడి వెళ్తూ ఓ జంట ఒక పోస్టును సామాజిక మాధ్యమాల్లో వదిలింది. నగరంలోని కాలుష్యం పెరుగుతుండటంతో తరచూ అనారోగ్యం పాలవుతున్నామని, ఇక్కడ ఉండలేమని నిర్ణయించుకున్న ఆ జంట దానికి కారణాలను ఒక వీడియో ద్వారా వివరించింది. అశ్విన్, అపర్ణ అనే యువ దంపతులు వ్యాపారం ద్వారా ఉపాధి పొందుతూ బెంగళూరులో రెండేళ్లు నివసించారు. నగరంలో పెరుగుతున్న కాలుష్యం వల్ల తమ ఆరోగ్యం క్షీణిస్తోందని వారు తెలిపారు. దీని కారణంగా యుక్తవయసులోనే అనారోగ్యం పాలవుతుండటం తమను బాధిస్తోందన్నారు. వాస్తవానికి ఈ నగర వాతావరణం, ఇక్కడి ప్రజలంటే ఎంతో ఇష్టమని, కానీ అనూహ్యంగా పెరుగుతున్న కాలుష్యం, పెరుగుతున్న నీటి సమస్య తమను చంపేస్తాయేమోనన్న భయంతోనే నగరాన్ని విడిచివెళ్లాల్సి వస్తోందని ఆవేదనతో వెల్లడించారు.

### మా మాటలు నచ్చకపోవచ్చు

బెంగళూరు మమ్మల్ని నెమ్మదిగా చంపేస్తోంది. ఈ మాటలు చాలామందికి నచ్చకపోవచ్చు. మమ్మల్ని ద్వేషించవచ్చు. కానీ వాస్తవం ఇదే అని కుండబద్దలు కొట్టారు. కొంతకాలంగా తాము తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని పేర్కొన్నారు. బెంగళూరుకు వచ్చాక తనకు శ్వాస సంబంధిత సమస్యలు, అలర్జీలు వచ్చాయని అశ్విన్ పేర్కొన్నారు. తాను సాధారణంగా అనారోగ్యం బారిన పడనని, కనీసం జలుబు కూడా చేయదని, కానీ బెంగళూరు వచ్చిన తర్వాత దగ్గు, తుమ్ములు పట్టుకున్నాయని అపర్ణ చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం వంటి జీవనశైలి మార్పులు చేసినప్పటికీ వారి ఆరోగ్యం మెరుగుపడలేదు.

### నగరంలో పెరుగుతున్న సమస్యలు

ఈ జంట చేస్తున్న ఆరోపణల్లో కొంత వాస్తవం లేకపోలేదు. పౌర జీవనానికి కనీస అవసరాలైన గాలి, నీరు, ఇళ్లు.. అన్నీ కొరతగా మారుతున్నాయి. ఒకప్పుడు మండు వేసవిలోనూ చల్లదనాన్నిచ్చే ఆహ్లాదకర వాతావరణం, ఉద్యానవనాలు, తోటలతో బెంగళూరు అందరినీ ఆకట్టుకునేది. అందువల్ల దీన్ని గార్డెన్ సిటీ అని పిలిచేవారు. కానీ ఐటీతోపాటు ఇతర రంగాలు భారీగా విస్తరించడం, వాతావరణాన్ని కాపాడే చర్యలు లేకపోవడంతో పరిస్థితి దిగజారిపోయింది. అభివృద్ధితోపాటు జనసంఖ్య, వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో గాలి నాణ్యత క్షీణించింది. స్వచ్ఛమైన గాలి గగనమైపోయినట్లు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణంగా గాలి నాణ్యత 34-66 పాయింట్ల మధ్య ఉండాలి. కానీ ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరులో సేకరించిన ఏక్యూఐ లెక్కల ప్రకారం గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయి అయిన 200 పాయింట్లను దాటి 297గా నమోదైంది. దాదాపుగా ఇదే స్థాయిలో గాలి కాలుష్యం పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి.

- పారిశ్రామికాభివృద్ధి కారణంగా నగరం విస్తరించి మహానగరంగా మారింది. జనాభా ఎన్నో రెట్లు పెరిగిపోయింది. జనావాసాలు పెరగడం, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు అపరిమితంగా జరగడం, వాటి నీటి అవసరాల కోసం విచ్చలవిడిగా బోర్లు తవ్వి మోటార్లతో తోడేయడం వల్ల భూగర్భజలాలు పూర్తిగా అడుగంటాయి. దాని ఫలితం గత ఏడాది నగరం జీవనంపై స్పష్టంగా కనిపించింది. గత ఏడాది వర్షాభావం నెలకొనడంతో నగరానికి నీటిని సరఫరా చేసే రిజర్వాయర్లు, భూగర్భ జలాలు అడుగంటాయి. దాంతో మొన్న వేసవిలో బెంగళూరు నగరంలో దాహం కేకలు మిన్నంటాయి. గతంలో ఎప్పుడూ ఇంత తీవ్రమైన నీటి సమస్య తలెత్తలేదని తరతరాలుగా నగరంలో ఉంటున్నవారు చెబుతున్నారు. దీనికితోడు పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి పథకాలను విస్తరించడం లేదా కొత్త పథకాలు నిర్మించడంపై ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించకపోవడం ఈ దుస్థితికి కారణం.
- దేశంలోని పలు ప్రాంతాల నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పెద్దసంఖ్యలో వలస వస్తున్న వారితో నగరం కిక్కిరిసిపోయింది. దీనికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు గణనీయంగా పెరిగాయి. ఇది నగరాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చేసింది. అయినా ఇంకా ప్రజల అవసరాలు తీరడం లేదు. అద్దె ఇల్లు లభించడమే గగనంగా మారింది. ఫలితంగా ఇళ్ల యజమానులు కొండెక్కి కూర్చున్నారు. అద్దెలు భారీగా పెంచడంతో పాటు సింగిల్ బెడ్‌రూం ఇళ్లకు కూడా రూ.లక్షల్లో అడ్వాన్సులు డిమాండ్ చేసేవారు. అయితే ఈ పరిస్థితి కొద్దిరోజులుగా మారుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధానమైన ఐటీ పరిశ్రమ ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తుండటంతో చాలామంది టెకీలు బెంగళూరును వీడి హైదరాబాద్, విశాఖ వంటి నగరాల్లోని ఐటీ కంపెనీల్లో చేరేందుకు తరలిపోతున్నారు. దాంతో చేరేవారు లేక అద్దె ఇళ్లు ఖాళీగా ఉండిపోతున్నాయి. ఈ పరిణామంతో ఇళ్ల యజమానులు మెల్లగా దిగివస్తున్నారు.

### నెటిజన్ల భిన్నాభిప్రాయాలు

ఈ నేపథ్యంలో అశ్విన్, అపర్ణ దంపతులు పోస్టు చేసిన వీడియో విపరీతంగా వైరల్ అయ్యింది. ఒక మిలియన్ వ్యూస్ వచ్చాయి. ఆ జంట వీడియోలో పేర్కొన్న అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చాలామంది ఆ జంట వాదనను సమర్థిస్తుండగా మరికొందరు విభేదిస్తున్నారు. బెంగళూరు జనాభా విపరీతంగా పెరగడానికి, ఇక్కడి వాతావరణం కాలుష్యమయం కావడానికి స్థానికేతరులే కారణమని ఓ నెటిజన్ రిప్లై ఇచ్చాడు. 'మీరు వెళ్లిపోయినందుకు ధన్యవాదాలు. మాకు కాస్త పరిశుభ్ర గాలి లభిస్తుందని మరో యూజర్ బదులిచ్చాడు. మరోవైపు చాలామంది ఆ జంట అభిప్రాయాలతో ఏకీభవించారు. 'బెంగళూరులో నివసించే వారు అపర్ణ, అశ్విన్‌ల వ్యాఖ్యలను వ్యక్తిగతంగా తీసుకోకుండా నగరంలో పెరుగుతున్న కాలుష్యం గురించి ఆలోచించాలని సూచించారు. మన నగరాన్ని సురక్షితంగా మార్చడానికి ప్రయత్నిద్దామంటూ ఓ నెటిజన్ కామెంట్ పెట్టాడు. కాలుష్యం గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సింది పోయి వారిని ద్వేషించడం సరికాదని చెప్పాడు.



• ఎడిటోరియల్

## కాంగ్రెస్: దేశంలో అలా.. రాష్ట్రంలో ఇలా!

సార్వత్రిక ఎన్నికలు జరిగి ఏడాది దాటింది. ఆ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం పోయి ఎన్డీయే కూటమి అధికారం చేపట్టింది. ఈ రెండో తేదీ నుంచి సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో తొలి వార్షికోత్సవ సంబరాలు కూడా చేసుకుంటోంది. మరోవైపు ఏడాదిగా తీవ్ర నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన ప్రధాన ప్రతిపక్షం వైకాపా ప్రభుత్వం నుంచి తీవ్ర నిర్బంధం ఎదురవుతున్నా మళ్లీ ప్రజల్లోకి వచ్చి పూర్వవైభవం సాధించడానికి మెల్లగా పావులు కదుపుతోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో భిన్నమైన రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. ఎక్కడైనా అధికార పార్టీపైనే ప్రతిపక్షాలు కలిసికట్టుగానో.. విడివిడిగానో పోరాటం చేయడం సహజం. రాజకీయాల్లో ఇదొక సంప్రదాయంగా కొనసాగుతూ వస్తోంది. కానీ చిత్రంగా మన రాష్ట్రంలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో కూర్చున్న వైఎస్ జగన్ పార్టీ అధికార కూటమితో పాటు ప్రధాన పార్టీలకు టార్గెట్ అవుతోంది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అటు కేంద్రం లోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థిగా కొనసాగుతోంది. కానీ ఏపీకి వచ్చేసరికి చంద్రబాబు సర్కారును కాకుండా ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైకాపాను ప్రత్యర్థిగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఏఐసీసీ ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్‌లు ఇప్పటికీ జగన్ లక్ష్యంగానే విమర్శలు సంధిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై మాత్రం మొక్కుబడిగా అప్పుడప్పుడు విమర్శలు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో అధికారంలో ఉన్న జగన్‌కు టార్గెట్ చేయడం ఒకే గానీ.. ఏడాది తర్వాత కూడా అదే పంథా కొనసాగించడం సరైన వ్యూహం కాదని సీనియర్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్న మూడు పార్టీల కూటమి 2029 ఎన్నికల దిశగా ఇప్పటి నుంచే రాజకీయ వ్యూహాలు అమలు చేస్తోంది. ఇటు జగన్ కూడా కూటమిపై పోరుబాటకు సిద్ధమవుతున్నారు. కానీ రాష్ట్రంలో విశ్వత్రపత్యం సాగించి, విభజన తర్వాత చతికిలపడిన కాంగ్రెస్ మాత్రం మళ్లీ అధికార వైభవం సాధించేందుకు కాకుండా జగన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తుండటం ఆ పార్టీ శ్రేణులకే మింగుడుపడటంలేదు. ఇది పరోక్షంగా చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి సర్కారుకే మేలు చేస్తుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ వైఖరి చూస్తుంటే గతంలో తనను ధిక్కరించి వెళ్లి సొంత పార్టీ పెట్టుకున్న జగన్‌పై పార్టీ అధినాయకత్వానికి ఇంకా కోపం పోయినట్లు లేదు. దానికితోడు కుటుంబ తగాదాల నేపథ్యంలో షర్మిల తన సొంత అన్న జగన్‌పై రాజకీయంగా కక్ష సాధించేందుకు పూనుకోవడం కూడా కలిసి వచ్చింది. దాంతో 2024 ఎన్నికల్లో సరికొత్త సమీకరణాలు తెరపైకి వచ్చాయి. ఎన్డీయే కూటమి వర్సెస్ వైకాపా అన్నట్లు జరిగిన ఆ ఎన్నికల్లో తెలంగాణలో తన పార్టీని చాపచుట్టేసి ఏకాఏకిన కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ ఏపీ అధ్యక్షురాలిగా రంగప్రవేశం చేసిన షర్మిల సొంత అన్న నేతృత్వంలోని వైకాపా ప్రభుత్వంపై కత్తి దూశారు. కుటుంబ వైరం నేపథ్యంలో షర్మిల, సునీత కలిసి జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసి ఆ ప్రభుత్వానికి దించేయడానికి ఒక చేయి వేశారు. అయితే ఇప్పుడు కూడా రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని కాకుండా జగన్‌పైనే షర్మిల ఎక్కువగా విమర్శలు చేస్తున్నారు. ఆమె తీరు మింగుడుపడని పలువురు కాంగ్రెస్ నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదులు చేశారు. పీసీసీ చీఫ్ హోదాలో పార్టీ రాజకీయాలకు ప్రయారిటీ ఇవ్వకుండా వ్యక్తిగత అజెండాతో పని చేస్తున్నారని పార్టీ అధిష్టానానికి రాసిన లేఖలో ఆరోపించారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం కూడా గతాన్ని మర్చిపోలేక జగన్‌పై పోరాటానికే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం జాతీయ రాజకీయ ప్రాధాన్యతలను కూడా ఏపీ వరకు పక్కన పెట్టేస్తోంది. వైకాపాలోకి వెళ్లిపోయిన కాంగ్రెస్ నేతలను తిరిగి రప్పించి, పార్టీని బలోపేతం చేసే విషయంలో షర్మిల విఫలమైనా జగన్‌తో ఆమెకున్న వ్యక్తిగత వైరం కలిసి వస్తుందని భావిస్తున్నట్లుంది. తాజాగా ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్ సైతం జగన్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్ విచారణలో భాగంగా వస్తున్న ఆరోపణలను ఆయన ప్రస్తావిస్తూ తాడేపల్లి, అమరావతిల్లో జగన్ భారీగా నిధులు దాచిపెట్టారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తద్వారా ఏపీలో తమ టార్గెట్ జగన్ అని కాంగ్రెస్ స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది.

## 'సుపరిపాలన'లో ఎంపీ కలిశెట్టి



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రణస్థలంలో పర్యటించారు. మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి ఏడాదికాలంలో టీడీపీ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకొని, ఇచ్చిన మాట ప్రకారం రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం రణస్థలం మండలంలో ఐక్యంగా ఉంటూ విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నందుకు నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రణస్థలం మండలపార్టీ అధ్యక్షులు లంకా శ్యామ్, టీడీపీ సీనియర్ నాయకులు పిషిణి జగన్నాథంనాయుడు, ఉమ్మడి జిల్లాల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పిన్నింటి భానోజీనాయుడు, ఎస్సీ సెల్ కార్యదర్శి ముక్కు ఆదినారాయణ, టీడీపీ నాయకులు లంకా ప్రభాకర్, కొవ్వాడ పోలీసు, దుంగా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కళ్యాణ్‌రామ్ జన్మదిన వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా కళ్యాణ్‌రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్ వైడ్ కన్వీనర్, శ్రీకాకుళం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు బుర్రి మధు, శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్‌వైడ్ కన్వీనర్ దుంగ శ్రీధర్ అధ్వర్యంలో నందమూరి కళ్యాణ్ రామ్ పుట్టినరోజు వేడుకలు శ్రీకాకుళం రెల్లవీధి నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా కళ్యాణ్‌రామ్ పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.షణ్ముఖరావు, వాసుపల్లి నరసింహమూర్తి, కె.సూరిబాబు, బద్రి మోహనరావు, తాళ్లవలస శ్రీనివాసరావు, సూరుశెట్టి ఈశ్వరరావు, అన్నెపు ధనుంజయ, దిబ్బ ప్రసాద్, ఎస్.గోపి, ఇంటి శంకర్, జగదీష్ పట్నాయక్, శ్రీకాకుళం జిల్లా కళ్యాణ్‌రామ్ అభిమానులు, శ్రీకాకుళం యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు, నందమూరి అభిమానులు పాల్గొని కళ్యాణ్‌రామ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## సారవకోటలో సుపరిపాలన

(సత్యంన్యూస్, సారవకోట)

టీడీపీ ప్రవేశపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తద్దపనస, వెంకటాపురం గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.



## గిరిపుత్రుల రేషన్ కష్టాలు తీర్చండి

(సత్యంన్యూస్, కొత్తూరు)

మండలంలోని గుట్టుపల్లి పంచాయతీలోని గిరిజన శిఖర గ్రామాలలో ప్రజలు రేషన్ కోసం అనేక కష్టాలు పడుతున్నారని, వారి ఇబ్బందులను తీర్చాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయారు. ఈ ప్రాంతంలో గల గిరిజనులు సుమారు రెండు మూడు రోజులుగా కొండ దిగువ ప్రాంతం రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తీరా వచ్చిన తర్వాత నెట్వర్క్ ప్రాబ్లం వస్తుందని, దాని మూలంగా పలుమార్లు రేషన్ డిపోకి, గిరిజన శిఖరాలకు తిరగాల్సి వస్తుందన్నారు. సరుకులతో గిరిజన శిఖరాలకు చేరుకోవడానికి నానా అవస్థలు పడుతున్నామని గిరిజనులు తమ గోడును వెల్లబుచ్చారన్నారు. కనీసం గిరిజన గ్రామాలకైనా రేషన్‌బియ్యం పంపిణీ చేసే వాహనాలను ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. గిరిపుత్రులతో సమస్యలు అడిగి తెలుసుకొని వారికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ధ్వజమెత్తారు.



## వారాహిమాత అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వారాహిమాత అనుగ్రహం ప్రజలందరిపైనా ఉండాలని నగరానికి చెందిన కింతాడ సంతోష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గంలో వారాహి అమ్మవారు దీక్షలు ఉన్నాయని తెలియజేసిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. రెండవసారి దీక్ష తీసుకొని అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా దీక్ష తీసుకోవడానికి ముఖ్య కారణం ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండి, పంటలు బాగా పండి, రైతులకు మేలు కలగాలని, విపత్తులు కలగకుండా రాష్ట్ర ప్రజలంతా ఆనందంగా ఉండాలనేనన్నారు. ప్రజలందరితోపాటు పవన్‌కళ్యాణ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, వారాహిమాత అనుగ్రహం ఆయనపై, అందరిపై ఉండాలని వారాహిదీక్ష 9వ రోజులో భాగంగా అందరూ బాగుండాలని కోరుకుంటూ కుంకుమ పూజలు చేశామన్నారు. కుంకుమపూజలో శ్రీను గురువు, పాండ్రంకి శంకర్, సర్వేశ్వరావు, కుమార్ గురుస్వామి, శ్రీకాకుళం నియోజకవర్గ అరసవిల్లికి చెందిన జనసేన నాయకులు కింతాడ సంతోష్, విస్సు దేవళ్ళ గురుస్వామి, పొన్నాడ కిషోర్, శరత్‌కుమార్‌లు పాల్గొన్నారు.




**వరుస ఫ్లాప్‌లను ఎదుర్కొంటున్న నితిన్ హీరోగా వచ్చిన తాజా సినిమా తమ్ముడు. వకీల్‌సాబ్‌తో పేరు తెచ్చుకున్న దర్శకుడు శ్రీరాం వేణు , చాలా కాలం తర్వాత కనిపించిన లయ. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు నిర్మించడంతో ఈ సినిమాపై కొంత అంచనాలు ఏర్పడ్డాయి. మరి ఈ సినిమా అంచనాలు అందుకుందా, లేదా?**

# నితిన్ బాణం గురి తప్పింది!

### కథ ఏంటి?

జై (నితిన్) ఢిల్లీలో వుంటాడు. విలువిద్య క్రీడాకారుడు. నేషనల్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాలని ఆశయం. కానీ లక్ష్యం వైపు దృష్టి సారించాలంటే ఏదో మెంటల్ బ్లాక్. అదేమంటే చిన్నప్పుడు విడిపోయిన అక్క (లయ) జ్ఞాపకాలు. ఆమెను కలవడానికి స్నేహితురాలు చిత్ర (వర్షబొల్లమ్మ)తో బయల్దేరు తాడు. లయ తన కుటుంబంతో కలిసి అంబర గొడుగు అనే అటవీ ప్రాంతానికి జాతరకు వెళ్లి వుంటుంది. అక్కడ ఆమె ప్రమాదంలో పడుతుంది. అక్కని తమ్ముడు ఎలా రక్షించాడన్నదే మిగతా కథ.



దర్శకుడు వేణు శ్రీరాం గతంలో ఎమ్‌సీఏ (మిడి ల్ క్లాస్ అబ్బాయి) తీశాడు. ఆ పోలికలు తమ్ముడిలో కనిపిస్తాయి. దాంట్లో వదిన, మరిది ఎమోషన్. ఆఫీసర్‌గా ఉన్న వదిన ప్రమాదంలో పడుతుంది. మరిది రక్షిస్తాడు. ఇక్కడ తమ్ముడు.ఎమ్‌సీఏలో ఎమోషన్ వర్కౌట్ అయ్యింది. తమ్ముడులో ఆ ఫీల్ లేదు. సన్నివేశాలన్నీ కృత్రిమంగా అనిపిస్తాయి. సినిమా అంతా కనిపించే అడవి మాత్రమే నేచురల్.

20 ఏళ్ల తర్వాత అక్క గుర్తుకు రావడం ఒక ఆశ్చర్యం అయితే. సరిగ్గా అదే సమయానికి కుటుంబంతో సహా ఆమె ప్రమాదంలో ఉండడం మరో ఆశ్చర్యం. ఇదంతా సినిమా లిబర్టీ అనుకుందాం, కానీ మన వ్యవస్థ ఎలా పని చేస్తూ వుందో దర్శకుడికి అర్థమైనట్టు లేదు.

ఇంకో హీరోయిన్ సప్తమి గౌడ (కాంతారా ఫేమ్) రేడియో జాకీ తరహాలో అడవిలో వుంటుంది. ఏదేదో మాట్లాడుతూ వుంటుంది.

ఫ్యాక్టరీ ప్రమాదంలో చనిపోయిన వాళ్లకు న్యాయం చేయాలని నిర్ణయించుకున్న లయ, తన కళ్ల ముందు అనేకమంది చనిపోతూ వుంటే నిమ్మకి నీరెత్తినట్టు వుంటుంది. మొదటి 15నిమిషాలు పర్వాలేదని పించి, తర్వాత చివరివరకు లేవకుండా తమ్ముడు పడిపోయాడు. ఎంతో అనుభవం ఉన్న దిల్‌రాజుకి ఈ కథలో ఏం నచ్చిందో తెలియదు. విపరీతంగా ఖర్చు పెట్టారు.

సినిమాలో హీరో నితిన్‌కి బాణం గురి తప్పుతూ వుంటుంది. కానీ కథల ఎన్నికలో ఆయన బాణం ఎప్పుడో గురి తప్పింది.

- బీబీసీ సౌజన్యంతో..

తమ్ముడు

మంత్రి,
ముఖ్యమంత్రి ఇన్వాల్వ్ అయిన కేసులో ఒక అధికారి ఇచ్చే నిజ నిర్ధరణ నివేదికకు ఏమాత్రం విలువ వుంటుంది? ఆమె సంతకం పెట్టకుండా వుండడానికి ఇంత కథ అవసరమా? ఒకవేళ ఆమె నివేదిక ఇచ్చినా ఫ్యాక్టరీ యజమానుల ఆస్తులు జప్తు చేయరు. కోర్టు ప్రొసీజర్స్ చాలా వుంటాయి. భోపాల్ కేసులో బాధితులకి ఇంకా న్యాయం జరగలేదు. కార్బైడ్స్ యజమాని ఆండర్సన్ శిక్ష పడకుండానే చనిపోయాడు. సినిమాల్లో ఇలాం-టి లాజిక్కులు అడగకూడదు. రెండున్నర గంటలు ప్రేక్షకుడిని రంజింప చేస్తే ఏమీ అడగరు. నత్తనడకతో సాగితేనే సమస్య.

### అక్కా తమ్ముళ్ల ఎమోషన్ పండిందా?

ఆంధ్రప్రదేశ్‌కు, ఛత్తీస్‌గఢ్‌కి మధ్యన అంబర గొడుగు అటవీ ప్రాంతం వుందట. అది ఏ రాష్ట్రానికీ చెందదు కాబట్టి పోలీసులు వెళ్లరట. అక్కడున్న వాళ్లు ఏ నేరమైనా చేసేస్తారట. కథని పూర్తిగా లిబర్టీతో రాసుకున్న దర్శకుడు అక్కాతమ్ముళ్ల ఎమోషన్‌ని కూడా పండించలేకపోయాడు. పాత్రల్ని రిజిస్టర్ చేయడంలో విఫలమయ్యాడు. విలన్‌కి శబ్దం వింటే ఇరిటేషన్ వస్తుంది. లయ కూతురు టెన్షన్ పడితే వెక్కిళ్లు వస్తాయి. వీరికి తోడుగా ప్రసవానికి సిద్ధంగా ఉన్న అమ్మాయి. అసలు నెలలు నిండిన అమ్మాయిని అడవిలో జాతరకి తీసుకొస్తారా? సినిమా కాసేపు ఫ్యామిలీ డ్రామాగా, కాసేపు అడ్వెంచర్‌గా, ఇంకాసేపు యాక్షన్ థ్రిల్లర్‌గా గజిబిజిగా వుంటుంది. వర్షబొల్లమ్మ, లయకి నటించే అవకాశం ఉన్నా సన్నివేశాలే లేవు. ఎంతసేపూ నితిన్ ఫైట్లు చేయడమే.

ఫిష్ వెంకట్‌కి ప్రభాస్ రూ.50లక్షల ఆర్థిక సాయం..

## ఇందులో వాస్తవం ఎంత?

టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ తీవ్ర అనారోగ్యంతో ఐసియు- వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నాడని కథనాలొచ్చాయి. అతడి కుమార్తె, కుటుంబ సభ్యులు ఇంతకుముందు సహాయం కోసం అర్థించారు. ఫిష్ వెంకట్ కి కిడ్నీ సంబంధిత సమస్యలకు చికిత్స జరుగుతోందని అయితే దీనికి 50లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు సూచించినట్టు వెల్లడించారు. అంతేకాదు కిడ్నీని వేరొక ధాత నుంచి సేకరించాల్సి ఉంది. అయితే కుటుంబ సభ్యులు ఎంతగా అభ్యర్థించినా సినీపరిశ్రమ నుంచి ఆర్థిక సాయానికి ఎవరూ స్పందించలేదని కూడా వారు ఆందోళన చెందినట్టు కథనాలొచ్చాయి.

అయితే ఈ ప్రచారం ఇలా ఉండగానే మరో కొత్త ప్రచారం ఇండస్ట్రీలో హీట్ పుట్టించింది. ఫిష్ వెంకట్ కిడ్నీ మార్పిడి చికిత్స కోసం ప్రభాస్ 50లక్షలు సాయం చేసారని స్థానిక మీడియాలతో పాటు, జాతీయ స్థాయిలో మీడియాలన్నీ అత్యుత్సాహంగా కవర్ చేసాయి. అయితే ఇప్పటికే ప్రభాస్ 50 లక్షల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందించారా? అంటే ఇంకా ఏ సాయం అందలేదని తెలుస్తోంది. ఫిష్ వెంకట్ కి ఆర్థిక సాయం అందిస్తామంటూ ప్రభాస్ అసిస్టెంట్ నుంచి కాల్ వచ్చిందని, అయితే కిడ్నీ ధాత దొరికిన తర్వాత సంప్రదించాల్సిందిగా వారు చెప్పినట్టు కథనాలొచ్చాయి. అయితే ఫిష్ వెంకట్ కి సాయం చేసేందుకు 'గబ్బర్ సింగ్ గ్యాంగ్' (సహనటులు) మాత్రమే ముందుకు వచ్చారని, పరిశ్రమ నుంచి ఇతరులు ఎవరూ ఎలాంటి సాయానికి ముందుకు రాలేదని ఒక సెక్షన్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఫిష్ వెంకట్ కుటుంబానికి ప్రామిస్ చేసింది ప్రభాస్ అసిస్టెంటేనా కాదా? అన్నదానిపైనా స్పష్టత లేదు. ఈ వార్తల్ని ప్రభాస్ టీమ్ అధికారికంగా కన్ఫామ్ చేయలేదు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..








# పాక్ నుంచి జెండా పీకేసింది!

మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్ లో తన ఆఫీస్ ని మూసేసింది! 2000, జూన్ నెలలో మైక్రోసాఫ్ట్ తన కార్యాలయాన్ని పాకిస్థాన్ లో ప్రారంభించింది! అఫ్కోర్స్! మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్ లో తన కార్యాలయం ని పూర్తిగా మూసివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు! 2000 లో మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్ లో తన కార్యకలాపాల కోసం కొత్తగా ఆఫీస్ ప్రారంభించాలని అని అనుకుంటున్నప్పుడు పాకిస్థాన్ కి చెందిన టెకీ అయిన జవ్వద్ రెహమాన్ మైక్రోసాఫ్ట్ తరుపున పాకిస్థాన్ లో ఆఫీస్ ఓపెన్ చేయడం కోసం సహకరించాడు. పాకిస్థాన్ లో ఉద్యోగులని ఇంటరవ్యూ చేసి ఉద్యోగులని రిక్రూట్ చేయడం తో పాటు కొన్నాళ్ళు అదే ఆఫీస్ లో పనిచేశాడు.

LinkedInలో పోస్టు పెడుతూ రెహమాన్ భావోద్వేగానికి గురయ్యాడు. సరిగ్గా 25 ఏళ్ళ క్రితం పాకిస్థాన్‌లో IT పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది అని భావించాను మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాల కోసం పాకిస్థాన్‌లో ఆఫీస్ ఓపెన్ చేయడం దానిలో నేను భాగస్వామి ని అవడం మీద ఆనందం అనుభవించాను. కానీ ఇప్పుడు అదే కార్యాలయం మూతపడుతుండడం బాధగా ఉంది!

జవ్వద్ రెహమాన్ తన LinkedIn పోస్టులో పాకిస్థాన్ IT మంత్రికి విజ్ఞప్తి చేస్తూ మల్టినేషనల్ సంస్థలు ఒక్కొక్కటి పాకిస్తాన్ నుండి బయటికి వెళ్ళిపోతుండడం ఎందుకు జరుగుతున్నదో ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకొని పరిస్థితి చక్కదిద్దుతారని ఆశిస్తున్నాను అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు!

### ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన ఉద్యోగులను తొలగిస్తున్నది!

మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులలో 4% మందిని అంటే 9,100 మందిని తొలగిస్తున్నది. ఇది క్లౌడ్ బేస్డ్ మరియు భాగస్వామ్య పద్ధతిలో తన కార్యకలాపాలని షిఫ్ట్ చేస్తున్న సందర్భంలో తీసుకుంటున్న చర్య అని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది!

లాభాల పరంగా చూస్తే పాకిస్తాన్ ఏ విధంగానూ అనువైనది కాదని 2022 లోనే మైక్రోసాఫ్ట్ ఒక నిర్ణయానికి వచ్చినా మూడేళ్ల ఆలస్యంగా తన ఆఫీస్ తో పాటు అన్ని కార్యకలాలని ఆపేసింది మైక్రోసాఫ్ట్! కేవలం లైజన్ ఆఫీస్ లో ఐదుగురు ఉద్యోగులు మాత్రం కొనసాగుతారు!

### ఇదంతా చైన్ రియాక్షన్!

ఆటోమోటివ్ దిగ్గజాలు అయిన సుజుకి, టొయోట, హోండా లు తమకి వ్యాపార అనుకూల పరిస్థితులు లేవని పాకిస్థాన్ నుండి వెళ్ళిపోయి చాలా కాలం అయ్యింది! హోండా 70సీసీ బైక్ ధర 1,60,000/- పాకిస్తాన్ లో. అఫ్కోర్స్! పాకిస్థాన్ లో అసెంబ్లీంగ్ యూనిట్స్ మాత్రమే నెలకొల్పయి జపాన్ ఆటో సంస్థలు. కోవిడ్ తరువాత అవి కూడా మూత పడ్డాయి.

మైక్రోసాఫ్ట్ వల్ల అంతో కొంత డాలర్ల రూపంలో ఫారెక్స్ పాకిస్తాన్ రిజర్వ్ బాంక్ లో జమ అయ్యేవి కానీ ఇకనుండి అదీ ఉండదు!

**- పొట్లూరి పార్థసారథి**

ఈ నెల 10న

# మెగా టీచర్ పేరెంట్ మీటింగ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మెగా టీచర్ పేరెంట్ మీటింగ్‌ను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ, జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ నెల 10న మెగా టీచర్ పేరెంట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్ లో శనివారం మెగా టీచర్ పేరెంట్ మీటింగ్‌పై సంబంధిత అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, విజన్ డెవలప్‌మెంట్ అధికారులు, ఈఆర్వోలు మెగా టీచర్ పేరెంట్ మీటింగ్ ఏర్పాటులలో సహకరించాలని తెలిపారు. ఆ రోజు నాటికి విద్యార్థులందరికి యూనిఫారంలు, కిట్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ రోజున విద్యార్థులంతా యూనీఫారంలు ఉండేటట్లు చూడాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరిన మేరకు మొక్కలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలో మొక్కలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమం సక్రమంగా నిర్వహించుటకు కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానించాలని ఆదేశించారు. తల్లికి వందనం పై ఆయన అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండల, జిల్లా స్థాయి షైనింగ్ స్టార్స్ పాఠశాలలో ఉంటే వారితో మాట్లాడించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యా శాఖ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో 2638 ప్రభుత్వ,389 ప్రైవేటు పాఠశాలల ఉన్నాయని, జూనియర్ కళాశాలల్లో 94 ప్రభుత్వ, 71 ప్రైవేటు కళాశాలలు ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుండి అందిన ఆదేశాలలో సూచనలన్నీ పాటిస్తూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్ కుమార్, డిఎఫ్ఓ వెంకటేష్, డిఆర్ఓ ఎం. వెంకటేశ్వరరావు, ఆర్డీఓ కృష్ణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వి శ్రీధర్ రాజ, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, డిఎస్పీ ఎల్. శేషాద్రి, ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు, ఆర్ఐఓ పి. దుర్గారావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఏఓ సూర్యనారాయణ, డిఈఓ కార్యాలయం ఎడి, సర్వ శిక్షా అభియాన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా సంతోషిమాత జయంతి వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎంతో ప్రసిద్ధి చెందిన ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కోటి మహిమలు గల తల్లి మహాశక్తి స్వరూపిణి బంగారు తల్లి అఖిలాండకోటి బ్రహ్మాండ జనని సిరులు తల్లి శ్రీకాకుళంలో కొలువై ఉన్న జగన్మాత శ్రీ సంతోషిమాత అమ్మవారి జయంతి మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ మహాగణపతి పూజ జన్మదిన సంకల్పం నిర్వహించారు. 108 కలశాలతో మహాన్యాసపూర్వక నమకచమక సహిత పంచసూక్తము లతో 108 లీటర్లతో మహా క్షీరాభిషేకంసేవ చేశారు. నాగావళి నదిలో అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహంనకు జలాభిషేకం, విశేష అర్చనలు, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ చేశారు. విశేష పుష్ప అలంకరణ సేవ నిర్వహించి శ్రీ సూక్తం విధానముగా షోడశోపచార సహిత సహస్ర నామార్చన కుంకుమ పూజలు చేశా రు. హిరణ్య అభిషేకం, ప్రత్యేక పూజలు అర్చనలు, చండీ పారాయ ణం చేశారు. మధ్యాహ్నం 13 పట్టుచీరలతో విశేష ద్రవ్యములతో చండీహోమం, ఆయుష్య హోమం, సంతోషిమాత లక్ష్మీ గణపతి ఆదిత్యాది నవగ్రహ మహా మృత్యుంజయ పరివార దేవత హో మం, సకల దేవత మంత్ర హవనములు చేశారు. 58రకాల పైన ద్రవ్యములతో మహా పూర్ణాహుతి, నీరాజనం, మంత్రపుష్పం, మహాహారతి, చతుర్వేద పారాయణం, అష్టదిగ్బంధం, అవభ్రధం, మంగళహారతి, వేద ఆశీర్వచనం తీర్థప్రసాదము వితరణ స్వస్తి వాచనములు ఋత్విక్‌లు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ, డాక్టర్ లుకలాపు ప్రస న్న కుమార్ దంపతులు, భాన్నా గోవర్ధన రావు దంపతులు, ఎమ్మె ల్యే గొండు శంకర్ సతీమణి గొండు స్వాతి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కుమారుడు, కార్యనిర్వహణాధికారిణి మునగవలస సుకన్య తదితరులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి

(సత్యంన్యూస్, పలాస)

విద్యుత్ చార్జీలు భారం తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శనివారం పలాస గాంధీ విగ్రహం వద్ద శనివారం సిపిఐ నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం యుగంధర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రజల పైన ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల పైన ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపిందన్నారు. అంతే కాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని అని చెప్పిన తెలుగుదేశం పార్టీ ఈ రోజున స్మార్ట్ మీటర్లను రంగంలోకి తీసుకువచ్చి స్మార్ట్ మీటర్లను బిగిస్తున్న పరిస్థితి అందరికీ తెలిసిందేనన్నారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేయమని డిమాండ్ చేసిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట సరికాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలను మోసగించవద్దని, రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ ప్రభుత్వం కరెంట్ చార్జీల భారాన్ని తొలగించాలని, స్మార్ట్‌మీటర్లు పేరిట సాగుతున్న దోపిడీని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయి, హరి, వాసు, వెంకట్రావు, కృష్ణ, జయరాం తదితరులు పాల్గొన్నారు




## బోధనలో సాంకేతికతను వినియోగించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

30జూన్ నుడి 4 జూలై వరకు మైసూర్‌లో జాతీయ విద్యా, పరిశోధనా సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్‌లకు (ఉపాధ్యాయులు) డిజిటల్ ఈ కంటెంట్ అండ్ ఐసిటి అనే అంశంపై 5 రోజుల శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంలో మన రాష్ట్రం నుండి విజయనగరం జిల్లా బొద్దూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు అదపాక దామోదర్‌రావుతోపాటు 13మంది ఎస్ఆర్జీలు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పీ.ఆర్.హరినాథ్ మాట్లాడుతూ బోధనలో సాంకేతికతను జోడించాలన్నారు. తద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని, ఉపాధ్యాయులకు కూడా బోధన సులభతరమవుతుందన్నారు. తాను చెప్పలేని వివరించలేని పాఠ్య విషయాలు విద్యార్థులకు సాంకేతికతను ఉపయోగించి చూపించవచ్చునన్నారు. బోధనలోనే కాకుండా మూల్యాంకనంలోనూ, ప్రగతిని పరిశీలించడంలోనూ, అదే విధంగా విద్యార్థుల ప్రగతి నమోదులోనూ సాంకేతిక ఉపయోగించాలన్నారు. దీని కోసం ఎక్స్ మైండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మై ఎక్స్పిడిషన్ ఈ కంటెంట్ తయారీ విధానాలను శిక్షణ కార్యక్రమంలో తెలియజేశారు. వీటిని ఉపాధ్యాయులు వినియోగించాలని తెలిపారు ఈ శిక్షణ కార్యక్రమంలో ఎస్.బి.షాజీ, నాలుగు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 40మంది స్టేట్ రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో అన్నదానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక గొంటి వీధిలోగల నైట్ షెల్టర్ లో నిరాశ్రయులకు, డే అండ్ నైట్ కూడలి, పాత బస్‌స్టాండ్ ఆవరణలో అన్న వితరణ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా చైర్మన్ పొన్నాడ రవి కుమార్ జన్మదినం సందర్భంగా జిల్ ఫౌండేషన్ జాడ సాయి అందించిన సహకారంతో శనివారం నగరంలో అభాగ్యులకు ఆహారాన్ని అందించామన్నారు. కొంక్యాన వేణు, పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ అన్నదానం మహోత్తరమన్నారు. ఆకలితో బాధపడేవాళ్ళకు అండగా నిలుస్తామన్నారు. లయన్స్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను నిత్యం కొనసాగిస్తున్నామన్నారు. నైట్ షెల్టర్ బాధ్యతలు చేపడుతున్న చేయూత మేమున్నాం అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకటలక్ష్మి అన్నీ తానై వీరి బాధ్యతను తీసుకోవటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ పట్నాయక్, పొన్నాడ రవికుమార్ కుటుంబ సభ్యులు, పొడుగు చరణ్‌లు పాల్గొన్నారు.



## పాఠశాలల బలోపేతం గ్రామ ప్రజల బాధ్యత

(సత్యంన్యూస్, ఎల్ఎన్‌పేట)

ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలంటే స్థానిక గ్రామ పెద్దలు సహకారం కచ్చితంగా అవసరం ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి మణికుమార్ తెలిపారు. మండలంలో ఎంపీ యూపీ కోవిలము పాఠశాలలో ఎన్రోల్మెంట్‌లో భాగంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారులు శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల విద్యార్థులు నమోదును పెంచుకుంటే సబ్జెక్టు టీచర్లను నియమించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయలు ప్రభుత్వ పాఠశాలలో ఉంటారని, పాఠశాల ఉపాధ్యాయులకు గ్రామంలో ఉండే ప్రజలు సహకరించి విద్యాభివృద్ధికి కీలక భూమిక పోషించాలని గ్రామస్తులను అతను కోరారు. విద్యార్థుల ప్రగతి, బోధన విధానాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయ వృత్తి అన్నింటి కంటే ఉత్తమమైనదన్నారు. కష్టపడే ఉపాధ్యాయునికి సమాజంలో గుర్తింపు వస్తుందని తెలిపారు. గ్రామ విద్య కమిటీలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పాఠశాల అభివృద్ధిని చేయాలని సూచించారు. మండలస్థాయిలో తమ పరిధిలో ఉన్న సహాయ సహకారాలను ఎల్లవేళలా అందజేస్తామని తెలియజేశారు కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చంద్రమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూల గజపతిరావు, ఉపాధ్యాయలు పెద్దకోట వెంకటరావు, పెద్దకోట శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి, విశ్వేశ్వరరావు విద్యావాలంటీర్ అవినాష్, సర్పంచ్ ప్రతినిధి నడిపిల్లి నారాయణరావు ఎంపీటీసీ మల్లేశ్వరరావు, గ్రామపెద్ద కొమరాపు చిరంజీవి రావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నర్సింహులు, వైస్‌చైర్మన్ రేవతి తదితరులు పాల్గొన్నారు.


















## ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయం వద్ద

# స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక పాలకొండ రోడ్డులో ఉన్న ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయం ఎదురుగా ఎట్టకేలకు మున్సిపల్ యంత్రాంగం స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేసింది. గతంలో ఇక్కడ స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడం వల్ల రెండు రోడ్ల కూడలిలో జరిగిన ప్రమాదంలో సచివాలయ ఉద్యోగిని మరణించింది. ఆ తర్వాత ఇక్కడ స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుచేశారు. కానీ రథసప్తమి సందర్భంగా పాలకొండ రోడ్డు సుందరీకరణలో భాగంగా కొత్త డివైడర్లు నిర్మించినప్పుడు దీన్ని తొలగించారు. అప్పట్నుంచి ఇక్కడ స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పౌర సమాజం కోరుతోంది. దీనిపై 'సత్యం' కూడా ఆమధ్య కథనాన్ని ప్రచురించింది. ఏడు రోడ్ల జంక్షన్ నుంచి డే అంట్ నైట్ వైపు వెళ్లే రోడ్డులో విజయగణపతి ఆలయం జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్ ఉన్నా, డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలికి వచ్చే రోడ్డులో ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయం వద్ద స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు గగ్గోలు పెట్టారు. ఎట్టకేలకు మున్సిపల్ యంత్రాంగం స్పందించి శుక్రవారం రాత్రి వీటిని ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజల సమస్యలు తెలుసుకోవడమే

# 'సుపరిపాలనలో తొలి అడుగు' లక్ష్యం



- ఇచ్చిన హామీలు అమలుచేశాం కాబట్టే మీ మధ్యకు రాగలిగాం
- ఏడాది పాలనలోనే అధిక శాతం హామీలు అమలు
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- కిష్టప్పేట, మామిడివలస, మునసబుపేటలో 'తొలి అడుగు'

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమని శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం మండల పరిధిలోని కిష్టప్ప పేట, మామిడివలస, మునసబుపేట గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలసి ఆయన పర్యటించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధినీ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధిక శాతం అమలుచేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నా రని, ఇచ్చిన హామీలను అమలు చేసాం కాబట్టే ధైర్యంగా తొలి అడుగుతో ప్రజల మధ్య వచ్చామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, ఉపసర్పంచ్ కుంచాల ఆది నారాయణ, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.



# సిఫార్సులు పట్టలేదు.. రూలూ్సా పాటించలేదు!

మొదటిపేజీ తరువాయి

అనితను శుక్రవారం పిలిపించుకున్నారు. ఈ సందర్భంగానే కౌన్సెలింగ్ వ్యవహారంపై మాట్లాడుతూ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్, ఏవో బాబూరావులను మార్చమని తానెప్పుడో చెప్పానని, ఇప్పుడు ఈ పెంటంతా తమ నెత్తిమీద పెట్టొద్దంటూ అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

### రీ కౌన్సెలింగ్‌పై కలెక్టర్ డోలాయమానం

సీన్ కట్ చేస్తే.. జేఏసీ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం స్వయంగా ఫిర్యాదు చేయడంతో ఈ ఆరోపణలపై కలెక్టర్ దినకర్ దృష్టి సారించారు. వెంటనే అన్ని వివరాలు తీసుకుని తనవద్దకు రావాలంటూ డీఎంహెచ్‌వో అనితను ఆదేశించారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు కార్యక్రమాలతో బిజీగా ఉన్న కలెక్టర్ ఆ తర్వాత డీఎంహెచ్‌వో చూపిన వివరాలు పరిశీలించి జీవోఎంఎస్ నెం.6ను ఫాలో కాలేదని అర్థం చేసుకున్నారు. అయితే ఇప్పుడు రీకౌన్సెలింగ్ నిర్వహించడం కుదురుతుందా లేదా? అన్న దానిపై ఆయన ఒక అభిప్రాయానికి రాలేకపోయారు. బదిలీల్లో కొన్ని నియోజకవర్గాలకు అన్యాయం జరిగిందని స్వయంగా కలెక్టరే పేర్కొనడం విశేషం. ఎందుకంటే.. ఇష్టారాజ్యంగా బదిలీలు చేయడం వల్ల పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని సచివాలయాల్లో గతంలో పని చేసిన ఏఎన్ఎం-3ల కంటే ఇప్పుడు 21 మంది తగ్గిపోయారు.

### కొత్త జిల్లా ప్రాతిపదికతోనే చేటు

వాస్తవానికి అన్ని సచివాలయాల్లోనూ ఏఎన్ఎంలు ఉండాలి. కానీ అందరూ అర్బన్‌కు, ఫోకల్ ఏరియాలకు బదిలీలు చేయించుకోవడం వల్ల పాతపట్నం లాంటి ట్రైబల్ ఏరియాలో 21 ఏఎన్ఎం పోస్టులు ఖాళీ అయిపోయాయి. దీన్ని గమనించిన కలెక్టర్ ముందు ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలు, నియోజకవర్గాల పరిధిలోని సచివాలయాలన్నింటిలో ఏఎన్ఎంలు ఉండేలా పోస్టింగ్‌లు ఇవ్వాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా 38 మండలాల పరిధిలోని 930 సచివాలయ ఏఎన్ఎం పోస్టులను ఖాళీగా ప్రకటించి, బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలి. కానీ కౌన్సెలింగ్ బోర్డు మాత్రం 605 మందే ఏఎన్ఎంలు ఉన్నారని చెప్పి.. వాటికే బదిలీల తతంగం నడిపించారు. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో ఏఎన్ఎంలు లేకుండాపోయారు. జిల్లాల విభజన తర్వాత విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కలిసిన నియోజకవర్గాలు, మండలాలతో తమకు సంబంధం లేదని కౌన్సెలింగ్ బోర్డు తప్పు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. అదే నిజమైతే రాజాం నియోజకవర్గ పరిధిలోని ఏఎన్ఎంలు ఇక్కడ కౌన్సెలింగ్‌కు ఎందుకు వచ్చినట్టు? ఎమ్మెల్యేల సిఫార్సులను గౌరవించినా ఒక విధంగా ఉండేది. అలా కాకుండా హేతుబద్ధంగా నిర్వహిస్తే నిఖార్సుగా ఉండేది. ఈ రెండూ చేయలేదు. ఉమ్మడి జిల్లాను ప్రాతిపదికగా తీసుకుంటే ఒక సంఖ్య తేలేది. అలా కాకుండా రెండు నియోజకవర్గాలను వదిలేసి మరో పక్క జిల్లా నియోజకవర్గాన్ని తీసుకోవడం వల్ల మరో అంకె వచ్చింది. మొత్తానికి ఏ నియోజకవర్గాల్లో ఏ సచివాలయాల్లో ఖాళీలు ఉన్నాయో ప్రకటించకుండానే పాలోమని జూమ్‌లోకి వచ్చేయడం వల్ల ఎవరికి ఎక్కడ పోస్టింగ్ ఇచ్చారో కూడా చెప్పలేకపోతున్నారు. కొన్ని సచివాలయాలకు ఇద్దరు చొప్పున బదిలీ కావడం దీనికి నిదర్శనం. అంటే ఒక స్థానాన్ని ఒకరు కోరుకున్న వెంటనే దాన్ని వేకెన్సీ జాబితా నుంచి తీసేయకపోవడం వల్ల మళ్లీ మళ్లీ భర్తీ చేసేశారు.

### కోర్టుకు వెళ్లే యోచనలో బాధితులు

తాజాగా శనివారం ఈ కథలో మరికొన్ని మలుపులు వచ్చాయి. కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరిగాయని బయటపెట్టిన ఒక ఏఎన్ఎంను పిలిచి ఆమె కోరుకున్న చోటకు పోస్టింగ్ ఇస్తామని డీఎంహెచ్‌వో బేరం పెట్టినట్టు తెలిసింది. ఇది తన ఒక్కరి సమస్య కాదని, తనలాగే నష్టపోయినవారందరిదీ అని పేర్కొనగానే, ఆమెతో పాటు మరో నలుగురిని కోరుకున్న చోటకు పంపిస్తామని, ఈ వ్యవహారాలకు ఇక్కడితో ఫుల్‌స్టాప్ పెట్టాలని రాయబారాలు నడుపుతున్నారట. కానీ గురువారం జేఏసీ నేత సాయిరాంతో వెళ్లిన బాధితులే మళ్లీ శనివారం కూడా కలెక్టర్‌ను కలవడానికి వెళ్లారు. రీకౌన్సెలింగ్ జరపకపోతే కోర్టుకు వెళ్లడానికి వీరు సిద్ధపడుతున్నట్టు భోగట్టా. అటు ఎమ్మెల్యేల సిఫార్సులూ చెల్లక, ఇటు రోస్టర్‌లో ముందున్న వారికి కోరుకున్న స్థానాలు ఇవ్వక, అర్బన్ నుంచి అర్బన్‌కు బదిలీ చేయాలన్న నిబంధన పాటించక 605 మందిని బదిలీ చేశారంటే.. ఎంత పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారి ఉండాలి? డబ్బులు తప్ప మరొకటి అవసరంలేని అధికారి అండదండలు ఉండి ఉండాలి..

# సీఎన్‌జీని సద్వినియోగం చేసుకోండి

### - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కంప్రస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. 80 అడుగుల రహదారిలోని పౌర సరఫరాల సంస్థ పెట్రోల్ బంకులో సీఎన్‌జీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎన్‌జీ వలన పొల్యూషన్ ఉండదని చెప్పారు. సీఎన్‌జీ కిలో 91 రూపాయలన్నారు. వాహనాలకు ఫిల్ చేసే ముందు, జాగ్రత్తలు పాటించాలన్నారు. బంకు వద్ద 450 కేజీల నిల్వ ఉంటుందని వివరించారు. టెక్కలి వద్ద సిఎన్జీ ఏర్పాటు చేయాలని ఇండియన్ ఆయిల్ కంపెనీ యాజమాన్యానికి మంత్రి ఆదేశించారు. టెక్కలిలో సీఎన్‌జీ ఏర్పాటుకు ఇప్పటికే అనుమతులు తీసుకున్నట్లు ఆర్డీవో కృష్ణమూర్తి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్‌కుమార్, ఆంధ్ర, తెలంగాణ, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రీజనల్ హెడ్ డి.సుధాకరరావు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, ఇండియన్ ఆయిల్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.






## నీట్‌లో మెరిసిన ఆణిముత్యం వైశ్యరాజు గీతిక

### - కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సూరిబాబు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నీట్‌లో మెరిసిన ఆణిముత్యం వైశ్యరాజు గీతిక అని, ప్రతీ విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగితే, తప్పకుండా నిర్దేశించుకున్న గమ్యానికి చేరుకుంటారని శర్వాణి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత వైశ్యరాజు నారాయణ రాజు (నక్క అప్పన్న) మనుమరాలు, నరసన్నపేట వైశ్యరాజు వెంకట అమ్మన్నరాజు, లక్ష్మి కుమార్తె అయిన గీతిక నీట్-2025 ఫలితాల్లో 527 మార్కులుతో ఆలిండియా ర్యాంక్ సాధించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిందని, కష్టపడి, ఇష్టపడి చదివి ఉత్తమ ర్యాంక్ సాధించటం హర్షణీయమన్నారు. అనంతరం గీతికను వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి పూజలందుకున్న కండువాతో సన్మానించి, జ్ఞాపికతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతిక కుటుంబ సభ్యులు, మాజీ సుడా చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు, పొట్నూరు పృథ్వీ రాజ్, కోరాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పూరీ జగన్నాథస్వామి రథయాత్ర సందర్భంగా మొండేటివీధిలోని శ్రీ లలితా దేవి సహిత శివ కామేశ్వర స్వామి ఆలయంలో శనివారం జగన్నాథ స్వామి శేష పానుపు అవతారంలో దర్శనమిచ్చారు. స్వామివారికి మధ్యాహ్నం 12 గంటలకు మహారాజు భోగ నైవేద్యం 56 రకాల స్వీట్స్‌ను నివేదించారు. సుమారుగా 100 పైగా వంటకాలతో వివిధ రకాల పిండివంటలు స్వామి వారికి, వారాహి అమ్మవారికి నైవేద్యం చెల్లించారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం



## పారిశుధ్యం సరే..

# బ్లీచింగ్‌కూ నోచుకోవడంలేదు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

సంతసీతారాంపురం పంచాయతీ చిన్నరావుపల్లి గ్రామంలో వీధులన్నీ పారిశుధ్య లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తున్నప్పటికీ స్థానికంగా ఉన్న సచివాలయ సిబ్బంది కనీసం పట్టించుకోవడంలేదని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తరచూ వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని భయపడుతున్నారు. కనీసం బ్లీచింగ్ అయినా చల్లే ఏర్పాటు కూడా చేయడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.